సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం । 24 । మార్చి । 2025



నివాళి.. పరామర్శ

పులివెందులలో పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్‌రెడ్డి భౌతికకాయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీ సమేతంగా సందర్శించి నివాళులర్పించారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ॥ (సా॥)	సహర్ మంగళ॥ (ఉ॥)
కడప	6.31	5.01
పులివెందుల	6.33	5.06
ప్రొద్దుటూరు	6.32	5.05

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.8/25.3

జిల్లాలో ఆదివారం 25.3 - 38.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దెబ్బతిన్న అరటి తోటలను నేడు వైఎస్ జగన్ పరిశీలన



పులివెందుల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 8.30 గంటలకు పులివెందుల నివాసం నుంచి బయలుదేరి లింగాల మండలంలో అరటి తోటలను పరిశీలిస్తారు. తాజాగా తీవ్ర ఈదురుగాలులతో లింగాల మండలంలో వేల ఎకరాలలో పంట నష్టం జరిగింది. నష్టపోయిన అరటి రైతులతో మాట్లాడతారు. అనంతరం వేంపల్లెలో జెడ్పీటీసీ రవి నివాసంలో జరిగే శుభకార్యానికి హాజరవుతారు. తర్వాత ఇడుపులపాయ చేరుకుని అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం తాడేపల్లి చేరుకుంటారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో తెలిపారు. ప్రజలు 08562-244437 ల్యాండ్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు గోవిందమాంబ ఆరాధన మహోత్సవం



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రభోదకర్త మద్విరాట్ శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరాచారి ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేయనున్నారు. అమ్మవారికి చీరె, సారె తదితరాలు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు సమర్పించనున్నారు. ఇందులో భాగంగా విజయవాడ నుంచి దాదాపు 200 మంది మహిళలు వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

29న తాళ్లపాకలో నాటక ప్రదర్శనలు

రాజంపేట టౌన్: అన్నమయ్య 522వ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ రాత్రి 7 గంటల నుంచి తాళ్లపాక ధ్యానమందిరం ఆవరణలో ఉచితంగా నాటకాలను ప్రదర్శించనున్నారు. ఈ విషయాన్ని అన్నమయ్య కళాకారుల ఐక్యవేదిక రాజంపేట అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నాటకాల ప్రదర్శన జరుగుతుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూ జీకేవై పథకం ద్వారా సీ-డ్యాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల కాలవ్యవధిలో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు ఆ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు పదవ తరగతి లేదా ఐటీఐ ఉత్తీర్ణత, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు ఇంటర్ లేదా డిగ్రీ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉత్తీర్ణత, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ ఇంటర్ ఉత్తీర్ణత, బ్యూటీ థెరపీకి పదవ తరగతి ఉత్తీర్ణత కలిగిన వారు ఈ శిక్షణ కోర్సులకు అర్హులన్నారు. అదనంగా బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9063082227, 9966448807 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్యం.. గాలిలో దీపం!

'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'లో పని చేస్తున్న సిబ్బంది తమ సమస్యల పరిష్కారానికి విధులను బహిష్కరించి ఆందోళన చేపడుతున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో అటు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదు. ఇటు సిబ్బంది వైద్యం అందించడం లేదు. దీంతో ఉచిత 'వైద్య సేవ' గాలిలో దీపంలా మారింది.

- 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ' సిబ్బంది ఆందోళన
- నేడు వైద్య సేవలు బంద్
- 27న కూడా నిరసన.. విధుల బహిష్కరణ
- అటు 'వైద్య సేవ' సిబ్బంది.. ఇటు 'పేదల ఉచిత వైద్యం'ను పట్టించుకోని ప్రభుత్వం



ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద వైద్య మిత్రల నిరసన (ఫైల్)



పుష్పగిరి హాస్పిటల్‌లో వైద్య మిత్ర కౌంటర్ వద్ద వేచి ఉన్న రోగులు, వారి సహాయకులు (ఫైల్)



కడప రూరల్: 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'లో పని చేస్తున్న వైద్య మిత్రలు, ఇతర సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మచ్చుకైనా చొరవ చూపడం లేదు. దీంతో ఉద్యోగులు దశల వారీగా విధుల బహిష్కరణ..శాంతి యుత నిరసనలను తెలుపుతున్నారు. అటు వైద్య సేవలో పని చేస్తున్న ఉద్యోగులను, ఇటు వైద్య సేవలకు ఆటంకం ఏర్పడితే పేదలు ఎదుర్కొనే సమస్యలను కూటమి పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

ఉద్యోగ భద్రత కోసం...

టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతోనే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా పేరును మార్చారు. కాగా పేరు మార్పుతోపాటు పథకంలో కూడా అనూహ్యమైన మార్పులను తీసుకు రావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. అందులో భాగంగా కొన్ని రాష్ట్రాల్లో అమలులో ఉన్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని.. రాష్ట్రంలో కూడా తీసుకు వచ్చి ఆ పథకానికి బీమాను అనుసంధానం చేయడానికి చర్యలు చేపట్టడం మొదలు పెట్టింది. దీంతో ఏళ్ల తరబడి ఆరోగ్యశ్రీని నమ్ముకుని పని చేస్తున్న ఆరోగ్యమిత్రల్లో (నేడు వైద్య మిత్రలు) ఆందోళన మొదలైంది. ఆరోగ్యశ్రీ ఇన్సూరెన్స్ పరిధిలోకి వెళితే.. ఆ సంస్థకు చెందిన వారు తమను తీసివేసి మరొకరిని నియమిస్తారనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనికితోడు ఈ వైద్య సేవలు బీమా పరిధిలోకి వెళితే వ్యాధుల సంఖ్యతోపాటీ ప్యాకేజీ గణనీయంగా తగ్గనుంది. దీంతో ఆరోగ్యశ్రీలో ఉండే ప్రయోజనాలు, బీమా వల్ల వచ్చే ఉపయోగాలు ఏమాత్రం ఉండవన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

సమస్యలు పరిష్కారం కానందున..

ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో పని చేస్తున్న వైద్య మిత్రలు, తమ ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నిరవధికంగా సమ్మెకు వెళ్లడానికి సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. 2024 నవంబరు 13వ తేదీన ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈఓ డాక్టర్ డి.లక్ష్మిషాతో చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలు ఏమాత్రం కొలిక్కి రాలేదు. ఈ సందర్భంగా సీఈఓ లక్ష్మిషా కొన్ని రోజులు ఆగాలని చెప్పడంతో ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది ఓపిక పట్టారు. నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో.. మళ్లీ ఆందోళన బాట పట్టడానికి శ్రీకారం చుట్టారు.

ఒక రోజు విధుల బహిష్కరణకే రోగులకు ఇక్కట్లు



'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'లో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్య మిత్రలు కీలకమైన విధులను నిర్వర్తిస్తున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రులకు వచ్చే రోగుల వివరాలను 'వైద్య మిత్ర'లు తెలుసుకుంటారు. అర్హులైన వారి పేరును ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. తరువాత ఆ వ్యాధిగ్రస్తుడిని వైద్య పరీక్షల కోసం వైద్యుడి వద్దకు తీసుకెళ్తారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి మందులు ఇచ్చి ఔట్ పేషెంట్‌గా ట్రీట్ చేస్తారు. సర్జరీ లాంటి వైద్యం అవసరం అయితే ఇన్ పేషెంట్‌గా చేర్చుకుంటారు. తరువాత ఆ వ్యాధిగ్రస్తుడు డిశ్చార్జ్ అయ్యే వరకు పర్యవేక్షణ బాధ్యతలను 'వైద్య మిత్ర'లే చూసుకుంటారు.

- ఈ నెల 17వ తేదీన (సోమవారం) వైద్యమిత్రలు ఒక రోజు విధులను బహిష్కించి, నూతన కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తమ సమస్యల పరిష్కారం కోసం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కాగా ఈ ఒక్క రోజు వైద్య మిత్రలు విధులను బహిష్కరించినందుకే పేదలైన రోగులు చాలా ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం వైద్య మిత్రల రోల్‌ను ఆసుపత్రులకే అప్పగించింది. అయినా కూడా ఆ రోజు వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులకు ఏ మాత్రం వైద్యం అందలేదు. అత్యవసరమైన ఇన్ పేషెంట్స్ రోగులను చేర్చుకుంటామని ఆసుపత్రుల సిబ్బంది చెప్పినా అది ఆచరణ సాధ్యం కాలేదు. ఇక ఓపీ (ఔట్ పేషెంట్స్)ను అయితే కనీసం పరీక్షించలేదు. దీంతో అస్వస్థతకు గురైన వారంతా చాలా.. చాలా ఇబ్బందులకు గురయ్యారు. కొంత మందైతే ఓపీ కింద డాక్టర్‌కు ఫీజులు చెల్లించి చూపించుకున్నారు. ఇంత జరుగుతున్నా ఆ శాఖ అధికారుల తోపాటు ప్రభుత్వం సైతం 'అంతా బాగానే ఉందని' చెప్పుకోవడం గమనార్హం. మళ్లీ సోమవారం వైద్య మిత్రలు విధులను బహిష్కరించి, నిరసన తెలపనున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి

పులివెందుల: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో జిల్లా మేనేజరు, టీం లీడర్, ఆఫీస్ అసోసియేట్, ఆరోగ్యమిత్ర, సీసీడీఈఓ గత 17 ఏళ్లుగా పరిష్కారం చూపని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం సోమవారం విధులను బహిష్కరించి అన్ని జిల్లాల్లోని జిల్లా సమన్వయకర్త డీసీ ఆఫీసుల వద్ద నిరసన తెలుపుతున్నారని ఎన్‌టీఆర్ వైద్య సేవ రాష్ట్ర యూనియన్ కమిటీ సభ్యుడు నాగార్జునరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి సంబంధించిన 17 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కేటగిరి 1 డీపీఓ క్యాడరు అమలు, కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ కల్పించాలన్నారు.

నేటి ఆందోళనకు మద్దతు తెలపాలి



పాత కలెక్టరేట్‌లోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కార్యాలయం ఎదుట సోమవారం విధుల బహిష్కరించి, శాంతియుత నిరసన తెలుపుతున్నాం. అలాగే 27న మంగళగిరిలోని ట్రస్ట్ ప్రధాన కార్యాలయం ఎదుట విధులను బహిష్కరించి, నిరసన తెలుపుతున్నాం. మేము చేసే న్యాయ పోరాటానికి అందరూ మద్దతు తెలపాలి.

– విజయ్, జిల్లా అధ్యక్షుడు, ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్

'శుభకార్యం'పై విచారణ

- నిధులు.. విధుల కేటాయింపులు
- ఓ విభాగం వైద్యాధికారి నిర్వాకం
- సీఎంఓ నుంచి వివరాల సేకరణ



సాక్షి టాస్క్‌ఫోర్స్: ఇంట్లో ఏదైనా శుభకార్యం పెట్టుకుంటే వచ్చిన అతిథులకు పది కాలాల పాటు గుర్తుండి పోయేలా కార్యక్రమాలను చేపట్టడం సాధారణ విషయమే. అలాగే శుభకార్యమంటే ఊరికనే జరిగిపోదు. ఏర్పాట్లు ఘనంగా ఉండాలంటే.. అందుకు సరిపడా బడ్జెట్ కావాలి. కాగా ఆయన ప్రధాన విభాగానికి చెందిన కీలక అధికారి. తన ఇంట్లో జరిగే కార్యక్రమానికి సిబ్బందికి నిధుల సేకరణతోపాటు విధులను కేటాయించడం గమనార్హం. విశ్వసనీయ సమాచారం మేరకు అందిన వివరాలు ఇలా ఉన్నాయి.

'డ్యూటీ చార్టు' సిద్ధం చేసి..

వైద్య ఆరోగ్య శాఖలో పలు కీలకమైన విభాగాలు ఉన్నాయి. అందులో అదొక విభాగానికి చెందిన జిల్లా కార్యాలయం. ఆ విభాగానికి చెందిన అధికారి ఇటీవల ఒక శుభకార్యం(వివాహ వేడుక) నిర్వహించారు. ఆ కార్యక్రమానికి అందరూ హాజరయ్యారు. స్థాయికి తగ్గట్టే శుభకార్యక్రమాన్ని బాగా నిర్వహించారని హాజరైన అతిథులంతా మెచ్చుకున్నారు. అంత వరకు బాగానే ఉంది. ఈ శుభకార్యక్రమం నిర్వహణపై ఇప్పుడొక సమస్య వచ్చింది. ఈ కార్యక్రమం నిర్వహణ తీరుపై ఎవరో సీఎంఓ (ముఖ్యమంత్రి కార్యాలయం)కు ఫిర్యాదు చేశారు. ఏమని ఫిర్యాదు చేశారంటే.. ఈ కార్యక్రమం నిర్వహణకు ఆ అధికారే స్వయంగా ఒక జాబితాను తయారు చేశారు. ఫంక్షన్ హాల్, కేటరింగ్, ఇతర పనుల ఖర్చుల బాధ్యతను ఒక్కొక్కరికి కేటాయించారు. అలాగే కార్యక్రమానికి వచ్చే అతిథులకు ఆహ్వానం పలకడంతోపాటు ఇతర కార్యక్రమాలను పర్యవేక్షించడానికి కూడా తన కింద పని చేసే సిబ్బందికి బాధ్యతలు (డ్యూటీ) అప్పగించారు. అలా నిధులు.. విధులను చేపట్టే వారి జాబితాను ఆ అధికారి 'డ్యూటీ చార్ట్'లా తయారు చేసి సంతకం కూడా పెట్టినట్లుగా సమాచారం. ఈ అంశాలను ఎవరో సీఎంఓకు ఫిర్యాదు చేశారు. దీంతో గడిచిన శనివారం నుంచి సీఎంఓ నుంచి ఇక్కడి కార్యాలయంలో పని చేసే సిబ్బందికి ఫోన్‌లు చేసి, వివరాలను సేకరిస్తున్నట్లుగా తెలిసింది. ఇప్పుడు ఈ వ్యవహారం ఆ శాఖలో తీవ్ర దుమారం రేపుతోంది.

స్పోర్ట్స్ అకాడమీకి గ్రహణం

- రూ.26.12 కోట్లతో వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు
- కూటమి ప్రభుత్వంలో పట్టించుకునే నాథుడే కరువు
- 22 నెలలుగా సిబ్బందికి అందని జీతాలు



పులివెందులలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో ఉన్న అధునాతన భవనాలు (ఇన్‌సెట్) హాకీ క్రీడా మైదానం

పులివెందుల టౌన్: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీకి చంద్ర గ్రహణం పట్టుకుంది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) నిధులతో 12.86 ఎకరాలలో 12 రకాల క్రీడాంశాలకు సంబంధించి వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశారు. 2023 జులైలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. హాకీ, ఆర్చరీ బ్లాక్‌లలో క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఎంతో ఉన్నతంగా క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ప్రత్యేక చొరవ తీసుకుని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే కూటమి అధికారంలోకి రాగానే అకాడమీలో క్రీడలకు మంగళం పాడారు. దాదాపు రూ.30 కోట్లతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ప్రస్తుతం ఎందుకూ పనికిరాకుండా పోతోంది. క్రీడలను ప్రోత్సహించేందుకు ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడటం లేదు. ఇక్కడ పని చేస్తున్న సిబ్బందికి 22 నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో వారు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. జీతాలు అందకపోతే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు జీతాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం క్రీడా ప్రాంగణంలో క్రీడలను ప్రోత్సహించి, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

అకాడమీని కొనసాగిస్తే ఎంతో మేలు

పులివెందులలో ఉన్న హాకీ అకాడమిని కొనసాగిస్తే ఎంతో మంది క్రీడాకారులు తయారవుతారు. హాకీ క్రీడామైదానం పులివెందులలో చాలా బాగుంది. ఇక్కడ ఆడుతుంటే బాగా క్రీడలో ప్రాక్టీస్ అవుతుంది. మా కోచ్ బాగా శిక్షణ ఇస్తున్నాడు.

– షాలిని, హాకీ క్రీడాకారిణి, ఆర్‌డీటీ, అనంతపురం

అందుబాటులో అధునాతన భవనాలు

పులివెందులలో హాకీ క్రీడామైదానం క్రీడాకారులు రాణించేందుకు ఎంతో అనువుగా ఉంది. ఇక్కడ అధునాతన భవనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తే క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించవచ్చు.

– శంకర్, హాకీ అకాడమి హెడ్ కోచ్, అనంతపురం

రామా.. సామాన్యుల బాధ కనుమా!

- వచ్చే నెల 11న రాములోరి కల్యాణం
- సామాన్య భక్తులకు కనిపించని భాగ్యం
- టీటీడీకి సవాల్‌గా మారనున్న పరిస్థితి



సీతారామలక్ష్మణ మూలవిరాట్‌లు

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆలయం ఒంటిమిట్ట కోదండ రామాలయం. ఇక్కడ ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో అత్యంత కీలకఘట్టం ఏప్రిల్ 11న జరిగే దాశరథి కల్యాణం. కల్యాణం కనులారా తిలకించే భాగ్యం సామాన్య భక్తులకు దరిచేరేలా ఉంటుందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో టీటీడీ ఎలా వ్యవహరిస్తుందనేది వేచిచూడాల్సిందే.

వీవీఐపీ, వీఐపీలకే పెద్దపీట వేసే క్రమంలో..

కల్యాణ వీక్షణకు వీవీఐపీ, వీఐపీలకు పెద్దపీట వేసే క్రమంలో సామాన్య భక్తులను దూరం చేస్తోందన్న అపవాదును టీటీడీ మూటకట్టుకోవాల్సి వస్తుంది. సామాన్య భక్తులు కూడా కనులారా వీక్షించే సౌకర్యం కల్పించాలని వినతులు వస్తున్నాయి. కనీసం కల్యాణం తర్వాత ఉత్సవమూర్తులను దగ్గరగా దర్శించుకునే భాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

- సామాన్య భక్తుల గ్యాలరీలు ఉన్నప్పటికీ, అవి కల్యాణ వేదికకు చాలా దూరంగా ఉంటాయి. కాబట్టి ఎల్‌ఈడీ స్క్రీన్‌లో మాత్రమే చూడాల్సి వస్తోంది. కేవలం కల్యాణ వేదికలో ఉన్నామన్న భావనతో ఉండాల్సి వస్తోంది. ఈ సారి 60 గ్యాలరీలు ఏర్పాటు చేయాలనే భావనలో టీటీడీ ఉన్నట్లు సమాచారం. భక్తులు మధ్యాహ్నం 2 నుంచి గ్యాలరీకి చేరుకుంటారు. ఈ ఏడాది భానుడి ప్రతాపం అధికంగా ఉంటోంది. కాబట్టి సౌకర్యాల కల్పనలో ఎలాంటి తప్పిదాలు తలెత్తినా.. టీటీడీ మరోసారి నిందలు మోయాల్సి వస్తుంది.

ప్రసాదాల కోసం పడరాని పాట్లు

రాములోరి కల్యాణం వీక్షించేందుకు వచ్చే సామాన్య భక్తులకు టీటీడీ అందజేసే ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాల విషయంలో ఎప్పుడూ తోపులాటలు జరుగుతున్నాయి. ఇలాంటివి చోటు చేసుకోకుండా ఉండేందుకు.. టీటీడీ గట్టి చర్యలు చేపట్టాల్సి ఉంది. తిరుమల శ్రీవారి లడ్డూలు రెండు (25 గ్రాములు) ఇచ్చేందుకు టీటీడీ యోచిస్తున్నట్లు తెలిసింది. పంపిణీ కౌంటర్ల విషయంలో గందరగోళం లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు. గతంలో కన్నా అధిక సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేసే యోచనలో టీటీడీ నిమగ్నం కావాలి. అలా చేస్తే.. సామాన్య భక్తులు ఇబ్బందులు పడకుండా ఉంటారు.

సర్వాంగ సుందరంగా..

కల్యాణ వేదికను పుష్పాలు, ఫలాలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు టీటీడీ సన్నద్ధమవుతోంది. ఈ మేరకు ఉద్యానవన విభాగానికి ఆ బాధ్యతలను అప్పగించనున్నారు. అందుకు సంబంధించి సన్నద్ధం కావాలని టీటీడీ ఆదేశించినట్లు సమాచారం. కడప-రేణిగుంట జాతీయ రహదారి పక్కన విశాలమైన ఖాళీ స్థలంలో రూ.40 లక్షలతో ప్రధాన కల్యాణ వేదిక నిర్మించారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి శాశ్వత పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రూ.45 కోట్లతో కలశం ఆకృతితో నిర్మాణాలు చేపట్టాలని టీటీడీ నిర్ణయించింది. తొలివిడతలో రూ.17 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కల్యాణవేదిక రహదారి, ముఖద్వారాలు, జాంబవంతుని విగ్రహం, పలు సౌకర్యాలకు రూ.28 కోట్లకు పైగా వ్యయం చేశారు.



కలశం ఆకృతిలో రాములోరి కల్యాణ వేదిక

పాలిసెట్, ఏపీ ఆర్‌జేసీలకు ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్: పులివెందుల నియోజకవర్గంలో 10వ తరగతి పరీక్షలు రాసిన గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థుల కోసం 16 ఏళ్లుగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం పాలిసెట్, ఏపీ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తోందని ఎస్‌ఏహెచ్ఎస్ అధ్యక్షుడు రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం రామకృష్ణయ్య, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శేష మహేశ్వరమ్మ, శ్రీదేవి, శైలజ, విజయానందన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866727534, 7093204537 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నేత్ర సేకరణ కేంద్ర టెక్నీషియన్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న రాజు, ఉపాధ్యాయులు

క్లుప్తంగా

గోడ కూలి వ్యక్తి మృతి



మృతి చెందిన రామచంద్రారెడ్డి

లింగాల : లింగాల మండలం ఎగువపల్లె గ్రామంలో శనివారం రాత్రి గోడ కూలి దిబ్బెల రామచంద్రారెడ్డి(65) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. రామచంద్రారెడ్డి కొత్త ఇంటిని నిర్మించుకునేందుకు పాత ఇంటిని తొలగించే పనులు చేపట్టాడు. జేసీబీతో పాత ఇంటిని తొలగించి వాటి రాళ్లను ట్రాక్టర్‌కు లోడు చేస్తుండగా రామచంద్రారెడ్డి బాత్రూం గోడ పక్కనే ఉన్నాడు. ట్రాక్టర్ రివర్స్ రావడంతో బాత్రూం గోడకు తగిలి గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. కూలిన గోడ రామచంద్రారెడ్డి పైన పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను వెంటనే పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కడపకు తీసుకెళుతుండగా మృతి చెందినట్లు కడప వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సులోచనమ్మ, కొడుకు భాస్కర్‌రెడ్డి, కోడలు సునీత, కుమార్తె కుమారి ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఇంటిల్లిపాది కన్నీటి పర్యంతమవుతున్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి



కాగడాలతో ప్రదర్శన చేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ లాంటి అమర వీరుల స్ఫూర్తితో విద్య, వైద్య, ఉపాధి హక్కుల కోసం పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం కోటిరెడ్డి సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు నివాళిగా కాగడాల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆయన హాజరై మాట్లాడుతూ త్యాగధనుల స్ఫూర్తితో సంపాదించుకున్న హక్కులను, ఆస్తులను, ప్రజాధనాన్ని బీజేపీ కార్పొరేట్ మిత్రులకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, ఆకిరానంద్ , తేజ, శరత్, ప్రభాకర్, వెంకటశివ, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గంగాధర్ వద్ద కుటుంబ సభ్యులు

కడప అర్బన్ : చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలో భాకరాపేట (విశ్వనాథపురం)లో నివాసం ఉంటున్న గంగాధర్ (40) అనే వ్యక్తి ఓ వడ్డీవ్యాపారి వేధింపులను భరించలేక ఆదివారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తాను ఇవ్వాల్సిన బాకీ కంటే పదిరెట్లు వడ్డీగా చెల్లించినా, ఇంకా డబ్బులను ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తుండటంతో ఈ చర్యకు పాల్పడ్డాడని అతని భార్య, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితుడు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

నివాళి.. పరామర్శ

పులివెందులలో కన్నుమూసిన పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్‌రెడ్డి భౌతికకాయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీ సమేతంగా సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కూడా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు పలువురు నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



చవ్వా విజయశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యలను పరామర్శిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విజయశేఖర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ భారతి



చవ్వా విజయశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ సునీతారెడ్డిని పరామర్శిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలి వచ్చిన అభిమానులు



వైఎస్ జగన్‌తో వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

చవ్వా విజయశేఖర్‌రెడ్డి నేత్రదానం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని చవ్వా సుభాకర్ రెడ్డి కాలనీకి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చవ్వా విజయ శేఖర్ రెడ్డి ఆదివారం మరణించడంతో ఆయన నేత్రాలను దానం చేశారు. భార్య సునీత, కుమారుడు దుష్యంత్ రెడ్డి, కుమార్తె మధులిక, చెల్లెలు ప్రమీలమ్మ, బావ వైఎస్ మనోహర్ రెడ్డి, వదిన సులోచనమ్మలు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి, నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారమిచ్చారు. నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని స్వగృహానికి వెళ్లి భౌతికకాయం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో బాధపడుతూ ఈ లోకాన్ని చూడలేని అంధులకు చూపు ఇచ్చినవారమవుతామన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు, బంధువులెవరైనా మరణిస్తే నేత్రదానం కోసం 9866727534, 7093204537 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.



విజయశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను సేకరిస్తున్న నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు, తదితరులు

ఉచితం మాటున ఇసుక దోపిడీ



టిప్పర్ల ద్వారా తరలిపోతున్న ఇసుక



స్టాక్ పాయింట్ వద్ద సిబ్బంది లేని దృశ్యం

- యథేచ్ఛగా టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రకృతి సంపద అధికార పార్టీ నేతలకు కల్పతరువుగా మారింది. రూ. లక్షల్లో కాసులు కురిపిస్తుండటంతో నిబంధనలు ఇసుకలో తొక్కేస్తున్నారు. ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసుకొని చిత్రావతి నది నుంచి ట్రాక్టర్లతో ఇసుక పాయింట్ వద్దకు కూలీలతో తోలే విధంగా అనుమతులు ఉన్నాయి. అయితే వాటిని పక్కన పెట్టి నదిలోనే ఇటాచీలతో నేరుగా తోలుకుంటున్నారు. స్టాక్ పాయింట్లను అనువుగా మార్చుకుని దందాకు తెర తీశారు. రోజూ పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా జోరుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన పోలీసు, మైనింగ్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కొండాపురం మండలంలోని ఇసుక రీచ్‌లలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఉచితం మాటున కొందరు టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇష్టారాజ్యంగా ఇసును ఇటాచీలతో తవ్వి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత ఇసుకను తీసుకొచ్చింది. ఇదే కొందరు అధికార పార్టీ నాయకులకు ఆదాయ వనరుగా మారింది. చిత్రావతి నది నుంచి ఒక టిప్పర్‌కు రూ.5 వేల నుంచి రూ. 6 వేలు తీసుకొని అక్రమంగా జోరుగా ఇసుకను తరలిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద బిల్లులు ఇచ్చే సిబ్బంది లేరు. ఇదే అదనుగా చిత్రావతి నది నుంచి అధికారుల అండతో పదుల సంఖ్యలో ఇసుక టిప్పర్లు అక్రమంగా తరలిస్తున్నారు. చిత్రావతి నది నుంచి కూలీలతో తోలకుండా యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. ఈ అక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి కేసులో ఆరుగురు నిందితుల అరెస్టు

1200 గ్రాముల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాసాపేట దొరల గోరీల సమీపంలో ఆదివారం ఆరుగురు వ్యక్తులు గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు టూటౌన్ సీఐ బి.నాగార్జున, ఎస్ఐలు ఎస్‌కేఎం హుసేన్, సిద్ధయ్యలు తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారన్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అరెస్టయిన వారిలో నల్ల వినోద్, జనితి నవనీష్ కుమార్, షేక్ ఖాదర్, మూడే పవన్ కుమార్ నాయక్, షేక్ సమీర్, గోదాన సుధీర్ ఉన్నట్లు తెలిపారు. పిల్లలు చెడువ్యసనాలకు బానిసలు కావడానికి తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమన్నారు. కాగా, నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కడప టూటౌన్ సీఐ నాగార్జున, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్ అభినందించారు.

పట్టు నిలుపుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు నిర్ణయం



నిరసన దీక్ష చేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఎట్టకేలకు పట్టు సాధించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున చైర్‌పర్సన్ వద్దకు వచ్చి చర్చించిన అనంతరం యథావిధిగా కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ముందుగా సూచించిన ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన శనివారం ఉదయం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కమిషనర్‌తో పాటు అధికారులెవరూ రాకుండా ఆమెను అవమానించారు. కనీసం ఒక్క అధికారి కూడా సమావేశానికి హాజరు కాలేదు. నిబంధనల ప్రకారం కోరం ఉన్నా కమిషనర్ రాకపోవడంతో సమావేశం జరగలేదు. అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారని గమనించిన చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం భోజనం కూడా అక్కడే చేయడంతో పాటు తమ దీక్షను నిరవధికంగా కొనసాగించాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో నిరసన దీక్ష చేస్తున్న చైర్‌పర్సన్ వద్దకు వచ్చారు. ఎందుకు కౌన్సిల్ సమావేశానికి రాలేదని ఆమె కమిషనర్‌ను ప్రశ్నించారు. అనారోగ్యం కారణంగా తాను హాజరు కాలేదని కమిషనర్ చెప్పగా, మీరు లేని పక్షంలో మీ స్థానంలో మరొక అధికారిని నియమించి కౌన్సిల్ సమావేశాన్ని యథావిధిగా నిర్వహించవచ్చనే ఆదేశాలు ఉన్నాయి కదా అని సభ్యులు అడిగారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఎలా చెబితే అలా చేస్తారా అని ప్రశ్నించారు. చైర్‌పర్సన్‌కు కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు సర్వాధికారాలు ఉన్నాయని వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా అన్నారు. కేవలం ఎమ్మెల్యే ఒత్తిడి వల్లే మీరు చెప్పా పెట్టకుండా సమావేశానికి గైర్హాజరయ్యారని తెలిపారు. పరిస్థితులను అర్థం చేసుకోవాలని మరోమారు ఇలా జరగకుండా చూస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. యథావిధిగా కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు నిరసన దీక్ష విరమించారు. ఈ సమస్యపై చైర్‌పర్సన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టుకు వెళ్లాలనే ఆలోచన చేశారు. పరిస్థితి సద్దుమణగడంతో సమస్య పరిష్కారమైంది.

కారు ఉంది.. టైర్లు మాయం



కారు టైర్లు ఎత్తుకెళ్లిన దృశ్యం

జమ్మలమడుగు : ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉంటే చాలు రాత్రికి రాత్రే వాహనాలకు సంబంధించిన ఏ విడి భాగాలు మాయం అయిపోతాయో అన్న భయం ప్రజల్లో మొదలైంది. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయం వద్ద అజీజ్ అనే ఉపాధ్యాయుడు షిఫ్టు డిజైర్ వాహనాన్ని పార్కింగ్ చేసి ఉంచాడు. ఆదివారం తెల్లవారుజామున వాహనానికి సంబంధించిన నాలుగు టైర్లు డిస్కులతో సహా ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెరిగిపోతున్న దొంగతనాలు..

పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కెనరా బ్యాంక్‌లో పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి సావిత్రి అనే మహిళ నాలుగు తులాల బంగారం దొంగలు దొంగిలించారు. అలాగే టిక్కాయ చేనువీధిలో పట్టపగలే ఇంటిముందు ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకును ఎత్తుకుని పోయారు. మండల పరిధిలోని పర్యాటక కేంద్రంలో పర్యాటకులకు చెందిన వస్తువులు దొంగిలించారు. అంబవరం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన వస్తువులు, మోటార్లు, ఇంటి వాకిళ్లు, కిటికీలు, గేట్లు ఎత్తుకుపోతున్నారు. పోలీసులు ఫిర్యాదు తీసుకుంటున్నారే తప్ప వాటిని రికవరీ చేయడం లేదని బాధితులు వాపోతున్నారు.

మైదుకూరు జాతరలో అపశ్రుతి

బాణసంచా పేలి బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన బాలుడు చరణ్ తేజ

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం జరిగిన జాతరలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున పెద్దమ్మతల్లిని ఊరేగింపుగా గద్దె వద్దకు తీసుకు వస్తున్న సమయంలో బాణసంచా పేలి చరణ్ తేజ అనే 14 ఏళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాణసంచా పేలడంతో బాలుడి పొట్టపైన, కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురు మహిళలు భయంతో పరుగెత్తి డ్రైనేజీలో పడి గాయపడ్డారు. గాయపడిన బాలుడు చరణ్ తేజకు స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి కడపకు తరలించారు. ఆదివారం రాత్రి కడపలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాలుడికి శస్త్ర చికిత్స జరిగింది. జాతరలో బాణసంచా పేల్చేందుకు నిపుణులను ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్లే ఈ సంఘటన జరిగిందని పలువురు అంటున్నారు. జాతరలో పెద్ద ఎత్తున శబ్దం వచ్చే బాణసంచా పేల్చడంపై కూడా విమర్శలు వస్తున్నాయి.

బైకును ఢీకొన్న కారు

వ్యక్తి మృతి



తలారి దానం (ఫైల్)



ప్రమాదంలో మృతి చెందిన తలారి దానం

దువ్వూరు : మండలంలోని కడప-కర్నూలు జాతీయ రహదారిపై టంగుటూరు మెట్ట వద్ద ఆదివారం కారు-బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న తలారి దానం (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన తలారి దానం పని మీద నంద్యాల జిల్లా చాగలమర్రికి వెళుతుండగా కడప - కర్నూలు జాతీయ రహదారిపై టంగుటూరు మెట్ట వద్దకు రాగానే.. కడప నుంచి కర్నూలుకు వెళుతున్న కారు వెనుక నుంచి అతివేగంగా బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న తలారి దానంకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతుండగా, కుమార్తె 8వ తరగతి చదువుతోంది. మృతుడు వ్యవసాయ పనులకు కూలిగా వెళ్లి కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో మాకెవరు దిక్కు అంటూ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

రిమ్స్ మార్చురీలో మహిళ మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్‌లో గుర్తు తెలియని మహిళ (45) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఈనెల 22వ తేదీ వరకు తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆమె మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. సంబంధీకులు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయశాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో న్యాయశాఖ ఉద్యోగులకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయశాఖ ఉద్యోగులకు ఇలాంటి ఆటల పోటీలు ఉపశమనాన్ని ఇవ్వడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించేందుకు ఆస్కారం లభిస్తుందన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్, అదనపు న్యాయమూర్తి రామారావు, ప్రభుత్వ న్యాయవాది శివ శంకర్ రెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానిబాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొబైల్ షాపు దగ్ధం



షాపులో కాలిపోతున్న వస్తువులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి

సుమారు రూ.15-20 లక్షలు నష్టం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం ముద్దనూరు రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు బహదూర్ బాషాకు చెందిన బీఆర్ మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.15-20 లక్షలు దాకా నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి పరిశీలించారు. వివరాలు ఇలా.. తిప్పలూరు గ్రామానికి చెందిన బహదూర్ బాషా గత కొన్నేళ్లుగా సెల్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున షాపులో షార్ట్ సర్క్యూట్ జరిగి పొగలు వ్యాపించాయి. దీంతో స్థానికులు అప్రమత్తమై షాపు యజమాని బహదూర్ బాషాకు సమాచారం అందించారు. వెంటనే అతను షాపు వద్దకు చేరుకుని షెట్టర్ తెరవగా లోపల ఉన్న సెల్ ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వస్తువులు కాలి బూడిదై ఉన్నాయి. ఇటీవలే సుమారు రూ.15 లక్షలు విలువ గల వివిధ వస్తువులు కొనుగోలు చేసి షాపులో ఉంచారు. మొత్తం రూ.20 లక్షలు విలువ చేసే వస్తువులు దుకాణంలో ఉన్నాయి. ఈ షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలోని వస్తువులన్నీ కాలిపోయాయి. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు మంటలు ఆర్పేందుకు సహకరించారు. తర్వాత అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అప్పటికే వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సంఘటన స్థలాన్ని సీఐ నరేష్‌బాబు పరిశీలించి బాధితుడితో మాట్లాడారు. అలాగే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకునానరు. బాధితుడికి పార్టీ తరఫున పూర్తి స్థాయిలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పెన్నా రషీద్, మహ్మద్‌గౌస్, మహమ్మద్ ఆలీతో పాటు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జయరామక్రిష్ణారెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.